క్లుప్తంగా

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



తెనాలి అర్బన్: ఇంటర్నేషనల్ బిషప్ గద్దం థామస్ 2వ వర్ధంతిని అయితానగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద పాస్టర్లకు నూతన వస్త్రాల్నిపంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్దం సన్నీ డానియేల్, గద్దం డేవిడ్ జాన్, గద్దం థామస్ జాన్, బాబు, చొప్పర డానియేల్, పీటర్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిరావాలి

కొల్లిపర: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రైతాంగ హక్కుల కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాది మంది తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రతి ఉద్యోగికి కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానం ఎత్తివేసి పర్మినెంట్ ఉద్యోగ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని కోరారు. అరవై ఏళ్లు నిండిన రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం. జయప్రద, కె.భవాని, టి.దీప్తి, రమేష్ , జిలుగు ముక్కంటి , గోదా ఏసుపాదం, ములకా శివకుమారి, జి.రామయ్య, రైతులు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవం

వల్లభాపురం (కొల్లిపర): మండలంలోని వల్లభాపురంలో ఈనెల 11,12 తేదీల్లో శ్రీవినాయకస్వామి ఆలయ 111వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంగణంలో మాట్లాడారు. 11న ఉదయం 10.30కి వేద ప్రచారకులు శ్రీ గొడవర్తి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విశ్వశాంతి యజ్ఞం(శాంతి హోమం), 12న 500కు పైగా సుందరకాండ పారాయణాలు నిర్వహించిన చిర్రా విష్ణువర్ధనరెడ్డి ఆధర్యంలో పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాల్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు అచ్యుత శ్రీరాములు, అచ్యుత ప్రభాకరబాబు, భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పుణ్యవతి (ఫైల్)

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులో శతాధిక వృద్ధురాలు తాళ్లూరి పుణ్యవతి (108) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె, మనవలు, మనమరాండ్రు, ముని మనవరాలు ఉన్నారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. గ్రామంలో పలువురు పుణ్యవతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తెనాలి రూరల్: చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో గతేడాది జరిగిన మూడు చోరీ కేసుల్లో నిందితుడిని నందులపేటకు చెందిన కోటిసాయి మంజునాథగా గుర్తించారు. కేసులను దర్యాప్తు చేసిన సీఐ కె. చంద్రశేఖర్, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అక్టోబరులో ఇతని వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను రికవర్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: నగరంలో అద్దె తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురు మహిళలు, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లు అందజేశారు. నగరంలోని తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న కుంచాల భూలక్ష్మి, బి.కామేశ్వరి, జి.సుబ్రహ్మణ్యం, షేక్ జైనబీ, సీహెచ్ వెంకట సుబ్బమ్మలకు బుధవారం నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆవరణ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా తోపుడు బండ్లను అందజేశారు. తమ జీవన భృతికి తోపుడు బండ్లు అందజేసి తమ జీవనాధారానికి బాసటగా నిలిచిన ఎమ్మెల్యే ఆర్కేకు చిరు మహిళా వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు పాల్గొన్నారు.

• పచ్చందనమే.. పచ్చదనమే



ఏపుగా పెరిగిన వేరుశనగ పంట



పిట్టలవానిపాలెంలో పచ్చందనం పరుచుకున్న మినుము పైరు

పిట్టలవానిపాలెం: వరి కోతలు పూర్తి చేసుకుని రబీసాగుగా చేపట్టిన పంటలు కళకళలాడుతున్నాయి.మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రధాన పంటగా వరి సాగు చేస్తున్నారు. వరి కోతల అనంతరం రబీసాగుగా చేపట్టిన వేరుశనగ, మొక్కజొన్న, మినుము,పెసర పైర్లు పచ్చదనంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు కురిసిన మంచు పైర్ల ఎదుగుదలకు దోహదపడ్డాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదివర్షాలు సకాలంలో కురవడంతో ధాన్యం దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలోనే లభించాయని రైతులు చెబుతున్నారు. రెండవ పంటగా మాగాణీ భూముల్లో చేపట్టిన మొక్కజొన్న, మినుము, పెసర సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇసుకనేలల్లో వేరుశనగ సాగును చేపట్టారు. ప్రధానంగా రబీపంటల్లో రారాజు మొక్కజొన్న,మినుములపై కొండంత ఆశ పెట్టుకుని పంటలను సాగు చేస్తున్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

భట్టిప్రోలు: మండలంలోని సచివాలయాల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో గురువారం నుంచి 2020–21 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్)కింద నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరుగనున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ రీసోర్స్ పర్సన్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో జిల్లా రీసోర్స్ పర్సన్లు ఎం.పెద్దయ్య, సి.చిరంజీవిలు భట్టిప్రోలు విచ్చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. జేఈ జయచంద్ర కుమార్ మాట్లాడుతూ మండలంలో మూడు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. 1.80 లక్షల పని దినాలకు కూలీలకు రూ. 5 కోట్లు, మెటీరియల్ కింద రూ.1.50 కోట్లు వెరసి మొత్తం రూ. 6.50 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని పేర్కొన్నారు. సూరేపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు సన్నెపాముల చంటి, ఓలేరు సర్పంచ్ మేరుగ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీతో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎస్‌ఆర్పీ, డీఆర్పీలు, పక్కన ప్రజా ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

నగరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి కె.కరుణశ్రీ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంలో కరుణశ్రీ పాల్గొని మాట్లాడారు. కాలుష్య నివారణకు మొక్కలు దోహదపడతాయని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.రాధారమణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కరుణశ్రీ, పక్కన తహసీల్దార్, ఎంపీడీఓ

మంత్రి నాగార్జునపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

అమృతలూరు(భట్టిప్రోలు): వేమూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, అహర్నిశలు ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడుతున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పై కొందరు అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పేర్కొన్నారు. అమృతలూరులోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ విద్యా విభాగం జిల్లా కార్యదర్శి చొప్పర రాజశేఖర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బర్మా ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ మూల్పూరు సర్పంచ్ మూల్పూరి రోజ్‌మేరి భర్త మాణిక్యాలరావు సోషల్ మీడియాలో మాదిగలు వివక్షతకు గురయ్యారని పేర్కొనడం సరికాదని అన్నారు. వ్యక్తిగత విషయాలను పార్టీకి ఆపాదించి మంత్రి నాగార్జునను మాదిగ వ్యతిరేకి అని సంబోధించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోతార్లంక సురేష్‌కుమార్, నాయకులు మూల్పూరు సీతయ్య, గాజులవర్తి బెనహర్, అమృతలూరి వెంకయ్య, తెనాలి పవన్‌కుమార్, మానుకొండ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: రాజకీయ పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని బాపట్ల శాసనసభ్యుడు కోన రఘుపతి అన్నారు. బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం మార్గాలు చూపించి, మరి కొన్ని సమస్యలను నమోదు చేసుకున్నారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతల హరిబాబు, వడ్డీముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి, చెంచయ్య, ఆట్ల ప్రసాదరెడ్డి, ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ, బాపట్ల రూరల్ ఎస్‌ఐ వెంకటప్రసాద్, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుని కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

డిజిటల్ విద్యపై అవగాహన పెంచుకోవాలి

తెనాలి అర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పుల్ని అందరూ అందిపుచ్చుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూలులో బుధవారం రిఫ్లెక్షన్ (ప్రతిబింబం) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా విధానంలో రాబోయేది డిజిటల్ యుగమేనని, దానిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పారదోలేందుకు రిఫ్లెక్షన్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. తమ పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

రామసాయి ధ్యాన మందిర వార్షికోత్సవారం ప్రారంభం

తెనాలి టౌన్ : రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి ధ్యాన మందిరంలో శ్రీ సద్గురు సాయి బాబా వార్షిక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, అఖండ జ్యోతి, దీపారాధన చేశారు. ప్రత్యేకంగా బాబా వారిని అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వివిధ భజన సమాజ మహిళలు సాయినామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు. అర్చకులు కారంశెట్టి శ్రీనివాసరావు పూజలు జరిపారు. కార్యక్రమంలో రామసాయి ట్రస్టు ప్రెసిడెంట్ బంకా సతీష్, వైస్ ప్రెసిడెంట్ మణిశెట్టి శ్రీనివాస్, సభ్యులు కొల్లిపర సీతారామ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, సీతారామయ్య, రవికుమార్, అమరేంద్ర ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో సాయిబాబా మూల విరాట్

వలంటీర్లకు నియామకపు ఉత్తర్వులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో ఇటీవల నాలుగు వలంటీర్ల పోస్టులు ఖాళీ కావడంతో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన అవి భర్తీ అయ్యాయి. ఎంపికైన వలంటీర్లకు బుధవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చేతుల మీదగా నియామకపు ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ఆళ్లమూడి, ఓలేరు గ్రామ సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, మేరుగ రంగారావు, సూరేపల్లి పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెదలంకలో రుద్ర హోమం

పెదలంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామంలో కొలువైన గంగాపార్వతి సమేత పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం చండీ హోమం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ప్రఖ్యా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. మాఘమాసం పురస్కరించుకుని ప్రతి ఏటా మహా శివరాత్రికి ముందు దేవాలయంలో ఈ హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో గత మూడు రోజులుగా గ్రామం సుభిక్షంగా ఉండాలని హోమాలు నిర్వహిస్తున్నారు.

గడ్డివాము దగ్ధం

రేపల్లె రూరల్: అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి వై.సాంబశివరావు కథనం మేరకు నగరం మండలం ధూళిపూడి నుంచి రేపల్లె మండలం ఉప్పూడికి చెందిన దాసరి సుదర్శన్ రెండు ఎకరాల గడ్డివామును ట్రాక్టర్‌పై బుధవారం తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో 13వ వార్డు సమీపంలో ట్రాక్టర్ చేరుకోగానే విద్యుత్ తీగలు రాసుకుని ట్రాక్టర్‌లోని గడ్డివాములపై నిప్పురవ్వలు పడటంతో వరిగడ్డికి నిప్పు అంటుకుంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసిందన్నారు. ప్రమాదంలో ట్రాక్టర్‌కు ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని చెప్పారు. రూ.15వేల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

• గోళీ కాదిది గుడ్డే..!



భట్టిప్రోలులో నందం లీలాకుమారి ఇంటి కోడి పెట్టిన గోళీ సైజు గుడ్డు ఇది. పక్కన సాధారణంగా పెట్టిన గుడ్డు

\- భట్టిప్రోలు

పౌరాణిక కళాకారుడు సాంబశివరావుకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం కార్తవరాయని కథ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం రాము చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు వడ్డీ సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాలేపాటి వెంకటరమణ, యలవర్తి కృష్ణ, గుగ్గిలం సుబ్బారావు, నాగం రమేష్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, కృష్ణకాంత్, అప్పయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

పెదపులివర్రు(భట్టిప్రోలు): లోక కల్యాణార్థం గ్రామంలో బుధవారం గుత్తావారిపాలెంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద బ్రాహ్మణులు మేడూరి శ్రీనివాస్ దీక్షితులు ఆధ్వర్యంలో శిష్య బృందం స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని రాజరాజ నరేంద్ర స్వామి వారి దేవాలయం వద్ద నుంచి కల్యాణ వేదిక వద్దకు కోలాట భజన సంకీర్తనలతో స్వామి వారిని ఊరింగింపుగా తీసుకువచ్చారు. గో పూజా కార్యక్రమం అనంతరం హోమం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కల్యాణంలో 21 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జంపని వీరయ్య, తాడేపల్లి వెంకట బసవయ్య, మేకల శ్రీనివాసరావు, పెసర్లంక శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.



కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

అవినీతిరహిత పాలనే సీఎం జగన్ లక్ష్యం

- టీడీపీ నేతల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు
- గడప గడపకు మన ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

నిజాంపట్నం: అవినీతి రహిత పాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. నిజాంపట్నం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాలో నగదును జమచేసి అవినీతి రహిత పాలనను సీఎం వైఎస్ జగన్ అందిస్తున్నారని తెలిపారు. దేశచరిత్రలో ఏ రాష్ట్రంలోనూ అమలుకాని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో జగనన్న అమలు పరుస్తున్నారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ రెండు కళ్లుగా పాలన సాగుతుందన్నారు. టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. తాను అధికారంలోని వస్తే సంక్షేమ పథకాలను నిలిపివేస్తానంటున్న చంద్రబాబుకు ప్రజలు రానున్న రోజుల్లో తగిన విదంగా బుద్ధి చెప్పాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధి వివరాలను వివరించారు. అదేవిధంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకురావడంతో సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి కొక్కిలిగడ్డ రవి, మోపిదేవి హరనాధబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీలు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు(ఎల్ఎస్ఆర్), మాజీ సర్పంచి రామాని కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, యార్లగడ్డ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పాలనను మెచ్చి ప్రజలు స్వచ్ఛందంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో బుధవారం టీడీపీకి చెందిన 10 మంది నేతలు వైఎస్సార్ సీపీలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ తరుణంలో ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును గుర్తించి స్వచ్ఛందంగా ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు మక్కువ చూపుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకూ ప్రజలలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీటీసీ సభ్యులు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు తదితరులున్నారు.



టీడీపీ నాయకులకు కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి

పాలిథిన్ వినియోగాన్ని నివారించాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారధి

రేపల్లె: పాలిథిన్ సంచుల వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ విజయసారధి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోయేందుకు అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు భూమిలో కలిసేందుకు చాలా సమయం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యమ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్ పదార్థాల విక్రయాలకు పాల్పడిన, వినియోగదారులు వినియోగించిన జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం

వ్యకాస బాపట్ల ఏరియా కార్యదర్శి జేబీ శ్రీధర్

కర్లపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల ఏరియా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. గురువారం కర్లపాలెం మండలంలోని పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉపాధిహామీ కూలీల పని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలోని కూలీలందరికీ 100రోజులు పని దినాలు కల్పించాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. కూలీలకు గతంలో ఇవ్వాల్సిన బాకీలు త్వరగా చెల్లించాలని కోరారు.వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ కరిముల్లా సన్నమూరి శ్రీనివాసరావు, శవనం హరిబాబురెడ్డి ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జేబీ శ్రీధర్

11 నుంచి 16వరకు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్లపాలెం: ఈనెల 11 నుంచి 16 వరకు కర్లపాలెం మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 12వరకు పేరలి గ్రామంలో, ఈనెల 13, 14 తేదీలలో గణపవరం గ్రామంలోనూ, ఈనెల 15, 16తేదీలలో చింతాయపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు.